చిన్నసైజు కోడిగుడ్ల
సరఫరాపై విచారణకు కలెక్టర్ ఆదేశం
'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

జనగామ చౌరస్తా, మార్చి 9 : జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నసైజు కోడిగుడ్లు సరఫరా అయిన విషయమై ఈ నెల 8వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా విచారణ కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలమైన పోషకాహారంగా 45 గ్రాముల నుంచి 50 గ్రాముల బరువున్న కోడిగుడ్లను పంపిణీ చేయాలి. అయితే కాంట్రాక్టర్ తక్కువ బరువున్న చిన్నసైజు కోడిగుడ్లను అంగన్‌వాడీలకు సరఫరా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తుండడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించడం చర్చనీయాంశమైంది.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

జనగామ చౌరస్తా, మార్చి 9 : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని జనగామ (వెస్ట్‌జోన్) డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ స్కూల్‌లో రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంస్కార వికాస సాధన యోగా శిబిరం నిర్వహించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పించే గురువులకు విద్యార్థులతో పాదపూజ చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను పూజించడం వల్ల మెరుగైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. తద్వారా భావిభారత పౌరులుగా విద్యార్థులు మారుతారని పేర్కొన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కేవీఎల్ఎన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

జనగామ రూరల్, మార్చి 9 : మండలంలోని పెంబర్తి ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాడు చదువుచెప్పిన గురువులు రాంసత్తయ్య, కృష్ణారావు, ఖాజామొహినొద్దీన్, సద్గుణాచారి, వేదాంతాచారి, మహేశ్‌ను ఘనంగా సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని విందు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నర్సింహ, పుప్పాల ఆంజనేయులు, రవి, రమేశ్, సిద్ధులు, నరేశ్, జ్యోతి, విన్య కుమారి, స్వరూప, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ రథాన్ని అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం

బచ్చన్నపేట, మార్చి 9 : సామాజిక సేవ లక్ష్యంగా లయన్స్‌క్లబ్ ముందుకు సాగుతుందని లయన్స్ క్లబ్ వరంగల్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. బచ్చన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.4 లక్షల వ్యయంతో రూపొందించిన వైకుంఠరథాన్ని ఆదివారం గ్రామ ప్రజలకు అందించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి, డయాబెటిస్ వైద్య శిబిరాలతోపాటు చలికాలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కన్నా పరశురాములు, రవీందర్‌రెడ్డి, గంగం సతీశ్‌రెడ్డి, పజ్జూరి జయహరి, ఈదుల కంటి ప్రతాప్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, పూర్ణచందర్, గోపాల్‌రెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, ముశిని రాజుగౌడ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

చికిత్స పొందుతూ
యువకుడి మృతి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై హామీద్ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేటకు చెందిన చెప్యాల వాసుదేవ్(24) ఈ నెల 8న వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. వాసుదేవ్ డిగ్రీ పూర్తి చేసి రెండు సంవత్సరాలైనా ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హామీద్ పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు అమెరికాపై ఉన్న ఆసక్తి రైతులపై లేదు

- పంటలు ఎండిపోతుంటే పట్టించుకోని యశస్వినీరెడ్డి
- ఝాన్సీరెడ్డికి ప్రజలపై ప్రేముంటే విజిటింగ్ వీసా రద్దు చేసుకోవాలి
- ఎర్రబెల్లిని విమర్శించే స్థాయి అత్తాకోడలుకు లేదు
- కాంగ్రెస్ నేతల వైఖరిపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు మంగళంపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాస్‌రావు

పాలకుర్తి, మార్చి 9: సాగునీరందక పంటలు ఎండిపోతుంటే రైతుల సమస్యలను పట్టించుకోలేని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అమెరికాలో పర్యటిస్తూ ఎంజాయ్ చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిని అని చెప్పుకునే హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అసలు భారతీయ పౌరురాలా.. ఆమెకు భారత పౌరసత్వం ఉందా అని బీఆర్ఎస్ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్లు మంగళంపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాస్‌రావు ప్రశ్నించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు, కార్మికులు, కర్షకుల కష్టాలు తెలిసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు పాలకుర్తి నియోజక వర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తే ఆయనతో ఝాన్సీరెడ్డి పోల్చుకోవడం సరికాదన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డికి పాలన చేతగాక, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డిపై కాంగ్రెస్‌లోనే తిరుగుబాటు మొదలైందన్నారు. సాక్షాత్తు ఆ పార్టీ నాయకులే విమర్శలకు దిగుతున్నారని చెప్పారు. పాలకుర్తి నియోజక వర్గంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, పంటలకు సాగునీరందక ఎండిపోతుంటే ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అమెరికాలో ఎంజాయ్ చేస్తున్నారని వారు ఎద్దేవా చేశారు. అత్తా కోడళ్లతో పాలకుర్తి నియోజకవర్గంలో ఆరాచక పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. సమస్యలపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులు, సామాన్యులపై కేసులు పెడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మీడియా చానళ్లకు ఏకంగా నోటీసులు పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఝాన్సీరెడ్డికి విజిటింగ్ వీసా ఉందని, ప్రజలపై ప్రేమ ఉంటే ఝాన్సీరెడ్డి అమెరికా వీసా రద్దు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆరు నెలలకోసారి ఎమ్మెల్యేకు అమెరికాలో ఏం పని అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటేనే గ్రూప్ విభేదాలు గొడవలకు, కొట్లాటలకు వేదిక అన్నారు. అలాంటి కాంగ్రెస్‌లో విభేదాలు ఉంటే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆపాదించడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులే అత్తకోడళ్ల తీరును ఛీ కోడుతున్నారన్నారు. బహిరంగంగానే కాంగ్రెస్‌కు చెందిన వారే విమర్శలు చేస్తుంటే ఏం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో అత్తాకోడళ్ల పని అయిపోయిందని, రాబోయే రోజులు బీఆర్ఎస్‌వే అన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు భారీ మెజారిటీతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ధరావత్ గాంధీనాయక్, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, సిందె రామోజీ, తీగల దయాకర్, ఈదూరు ఐలయ్య, మునావత్ నర్సింహనాయక్, శ్రీరాం సుధీర్‌కుమార్, రంగు కుమార్, తూర్పాటి ఆంజయ్య, రాజేశ్ నాయక్, బొబ్బల అశోక్‌రెడ్డి, పేరం రాము, దీకొండ వెంకటేశ్వర్‌రావు, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, పూస మధు, చింత రవి, రాంసింగ్ నాయక్, బానోత్ మహేందర్, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరాడుతాం

రఘునాథపల్లి, మార్చి9 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని, లేకుంటే ప్రజలను సమీకరించి పోరాతామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న హెచ్చరించారు. ఆదివారం మండలంలోని భాంజీపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి పంటలకు సాగునీరందక ఎండిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేవాదుల రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని కోరారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటున్నందున అధికారులు దీనిని నివారించాలన్నారు. పొగాకు పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నందున మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శిగా ముప్పిడి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా ఉడుగుల జయమ్మను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కావటి యాదగిరి, నాయకులు శాడ ఎల్లయ్య, శాడ పార్వతమ్మ, కుమారస్వామి, నర్సయ్య, వెంకన్న, ఎల్లయ్య, చాట్ల లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

భాంజీపేటలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఆది సాయన్న

ఆలయాల అభివృద్ధికి విరాళం

లింగాలఘనపురం, మార్చి 9 : మండలంలోని జీడికల్‌లో నిర్మించనున్న మల్లికార్జున స్వామి, ఎల్లమ్మ దేవాలయాలకు మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆదివారం రూ.10 వేలు విరాళం అందించారు. జీడికల్ గ్రామాన్ని వంశీధర్‌రెడ్డి సందర్శించగా యాదవ సంఘం నాయకులు కలిసి ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన వంశీధర్‌రెడ్డి విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, యాదవ సంఘం నాయకులు కొండబోయిన సంపత్, రాజు, మహేశ్, కీసర దిలీప్‌రెడ్డి, దేవరాయ రాజు, బుషిగంపల ఆంజనేయులు, బొల్లంపెల్లి నాగేందర్, ఏలె నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు
యువత దూరంగా ఉండాలి : ఎస్సై

తరిగొప్పుల, మార్చి 9 : మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీదేవి సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. గుట్కా, జూదం, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా తల్లితండ్రులు వారిని పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి, అవగాహన పెంచుకునేలా వారిని తీర్చి దిద్దాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరకంగా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నంబరు ప్లేటు లేని వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక

జస్వంత్

ఎన్ శ్రీమాన్

బురుగు రాజు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 9 : కేంద్రంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ అవార్డులకు తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తాటికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం లింగమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. తమ పాఠశాల విద్యార్థుల్లో జస్వంత్ ఆటోమెటిక్ డ్రైనేజ్ సిస్టమ్, శ్రీమాన్ బేబి సేఫ్టీ క్రాడిల్, బురుగు రాజు ఆటో మేటిక్ లైటింగ్ సిస్టమ్ ఎగ్జిబిట్లకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జూన్ నుంచి అక్టోబర్ నెలల్లో జిల్లా స్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్‌లో వీరు పాల్గొంటారని లింగమూర్తి పేర్కొన్నారు. గైడ్ టీచర్లు మురళి, అనసూయ, శ్రీనివస్, ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎంతోపాటు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బేతి మంజులరెడ్డి, రవీందర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి, రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

బండ్లగూడెంలో అగ్ని ప్రమాదం.. పదెకరాల్లో కాలిన పొలాలు

మంటలు వ్యాపించడంతో బండ్లగూడెం శివారులో కాలిన పొలాలు

లింగాలఘనపురం, మార్చి 9 : మండలంలోని బండ్లగూడెంలో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. రైతులు, గీత కార్మికులు సమయస్ఫూర్తితో వ్యవహరించి మంటలను అదుపుచేయడంతో నాలుగు ఆవులు ప్రాణాలతో బయటపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడెం చెరువు సమీపంలో బెస్త శ్రీశైలం వ్యవసాయ బావి ఉంది. వీరి నాలుగు అవులను కొట్టంలో తోలి ఇంటికి వెళ్లిపోయాడు. ఆ ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి బీడి కాల్చి ఆర్పకుండా వేయడంతో ఆ ప్రాంతంలోని చెత్తా చెదారం, గడ్డికి నిప్పు అంటుకుంది. మంటలు చెలరేగడంతో 10 ఎకరాల్లో కొయ్యకాళ్లు కాలిపోయాయి. గమనించిన గీత కార్మికుడు బోయిని కుమార్ రైతులకు సమాచారం అందించి అప్రమత్తం చేశాడు. వారంతా బోరుబావి పంపుసెట్‌కు పైపులను అమర్చి రెండు గంటలపాటు నీళ్లు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చి ఆవులు బతికి బయట పడ్డాయి. ఈ కార్యక్రమంలో పడిద రాజశేఖర్, బోయిని కుమార్, బెస్త శ్రీశైలం, గట్టగల్ల అనిల్, నోముల ఉపేందర్, నోముల రాములు, బలుపాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను
యువత ప్రోత్సహించాలి

దేవరుప్పుల, మార్చి 9: నేటి యువత ఆదర్శ వివాహాలను ప్రోత్సహించడంతోపాటు నిరాడంబరంగా పెళ్లిళ్లు చేసుకోవాలని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భైరి నరేశ్ అన్నారు. మండలంలోని ధర్మాపురంలో దౌపాటి ప్రశాంత్– తూడి రేష్మకు ఆదివారం ఆదర్శ వివాహం జరిగింది. భైరి నరేశ్ మాట్లాడుతూ యువత ఖర్చులేని పెళ్లిళ్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పూలే, పెరియార్ దంపతులను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యామ్నాయ సాంస్కృతిక వేదిక నాయకురాలు గాండ్ల సుజాత, జిల్లా అధ్యక్షుడు గట్టగళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు బాలెం ఉమేశ్ పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్‌లో
కొనసాగనున్న 'ప్రజావాణి'

జనగామ చౌరస్తా, మార్చి 9 : స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు సమర్పించే ప్రజలకు జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మరోవైపు తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు సకాలంలో కలెక్టరేట్‌కు చేరుకోవాలని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా సూచించారు.

కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని డ్రైనేజీ నిర్మించాలి

కబ్జాకు గురైన భూమి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 9 : మండలంలోని ఇప్పగూడెంలో జడ్పీ హైస్కూల్ సమీపంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం డ్రైనేజీ పనులు చేపట్టాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆందోళన నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ వద్ద రోడ్డుకు సంబంధించిన ప్రభుత్వ భూమి సుమారు 300 గజాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని గ్రామస్తులు తెలిపారు. కబ్జా మూలంగా రహదారి ఇరుకుగా మారిందని తెలిపారు. టర్నింగ్‌పై భారీ వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా ఉందని, దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్ చేశారు.

వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగ ఫలితాలు నిలిపివేయాలి

జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

జనగామ చౌరస్తా/లింగాలఘనపురం/చిల్పూరు, మార్చి 9 : ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు గ్రూప్ 1, 2, 3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలు నిలిపివేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో, లింగాలఘనపురం, చిల్పూరు మండల కేంద్రాల్లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఎదుట నల్ల రిబ్బన్లు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు రాగల్ల ఉపేందర్, గద్దల కిశోర్ మాట్లాడుతూ మాలల ఒత్తిడికి తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు, ఉప కులాలకు ప్రభుత్వ ఉద్యోగాలు రాకుండా కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. వర్గీకరణ చట్టం చేస్తామని ఓ వైపు చెబుతూనే, మరోవైపు మాదిగలు, ఉప కులాలలకు ఉద్యోగాలు రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. టీజీపీఎస్సీ తన ప్రకటనను విరమించుకొని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ ఫలితాల వెల్లడి నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ప్రజా సంఘాల నాయకులు పసుల ఏబేల్, మల్లిగారి రాజు, నర్సయ్య, రాజశేఖర్, నాగరాజు, రాజు, మహేశ్, రవి, రాజు, ప్రవీణ్, కుమారస్వామి, సాగర్, లాజర్, వీరస్వామి, రాము, సురేశ్, రమేశ్ పాల్గొన్నారు. లింగాలఘనపురంలో నిర్వహించిన ధర్నాలో సంఘం మండల అధ్యక్షుడు గండి సురేశ్, నాయకులు సింగపురం జగన్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ జడ్పీటీసీలు మారపాక రవి, గుర్రం యాదగిరి, ధర్మసాగర్ మాజీ ఎంపీపీ యాదగిరి, శాడ కుమార్, గండి యాదగిరి, గట్టగల్ల సంజీవ, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు. చిల్పూరులో నిర్వహించిన నిరసనలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్, నాయకులు నలిమెల నాగరాజు, ఆరూరి శ్రీనివాస్, గడ్డమీది వెంకటస్వామి, నలిమెల కుమారస్వామి, మంతెన రాజు, పోశయ్య, చిట్యాల దయాకర్, మహిపాల్, నలిమల రజనీకుమార్, ఆరూరి స్వామి, కర్ణకంటి వెంకటేశ్, ఎడ్ల రాజేశ్, ఎడ్ల శ్రీనివాస్, ఎడ్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

టీమిండియాకు ఎమ్మెల్యే పల్లా అభినందనలు

జనగామ చౌరస్తా, మార్చి 9 : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా నిలిచిన టీమిండియాకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఆదివారం దుబాయ్ వేదికగా ఉత్కంఠభరితంగా కొనసాగిన మ్యాచ్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పల్లా వీక్షించారు. ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా న్యూజిలాండ్‌పై ప్రపంచ ఛాంపియన్‌గా ఘన విజయం సాధించడపట్ల ఎమ్మెల్యే పల్లా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, నీల యాదగిరి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆశీర్వాదం

వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, మార్చి 9: మండలంలోని కడవెండికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అస్నాల కొమురాజీ కుమారుడు నరేశ్ వివాహం ఇదే గ్రామానికి చెందిన మైనాల కిష్టయ్య కూతురు రమ్య తో మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. వేడుకలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, అధికారి ప్రతినిధి సుడిగెల హనుమంతు, మాజీ ఉపసర్పంచ్ నగేశ్, పెద్ది రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా
పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ : బీఆర్ఎస్

పాలకుర్తి, మార్చి 9: నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎమ్మెల్యేకు తెలిపేందుకు ప్రభుత్వం నిర్మించిన క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడమేమిటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం పార్టీ నాయకులు మంగళంపల్లి శ్రీనివాస్, దారవత్ గాంధీనాయక్, పసునూరి నవీన్, ఓయూ జేఏసీ నేత రాజేశ్‌నాయక్ మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులతో ఇక్కడ సమావేశాలు, సభలు నిర్వహించడం స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి తగదన్నారు. క్యాంప్ కార్యాలయంలో ఝాన్సీరెడ్డికి ఏం పని అని వారు ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోకుంటే బీఆర్ఎస్ నాయకులుగా తాము కూడా క్యాంప్ కార్యాలయంలో పత్రిక సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

జనగామను సర్వాయి పాపన్న జిల్లాగా మార్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

రఘునాథపల్లి, మార్చి 9: జనగామ జిల్లాను సర్వాయి పాపన్న జిల్లాగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం సమావేశం జరిగింది. మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద సర్వాయి పాపన్న జిల్లా సాధన కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లాలోని గీత కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తిని మురహరిగౌడ్, కొప్పుల రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు

తరిగొప్పులలో..

తరిగొప్పుల : జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని గోపా మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని పాలకులు నెరవేర్చాలని రాజేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నగోని సుదర్శన్‌గౌడ్, వంగ రామరాజు, జొన్నగోని కిష్ట య్య, కొయ్యడ శ్రీనివాస్, కల్లు గీత కార్మిక సంఘం మం డల అధ్యక్షుడు తాళ్లపల్లి పోశయ్య, వంగ భీమయ్య, రవి, నాగపురి అంజయ్య, మూల మహేశ్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం బాధితుడికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

చిల్పూరు, మార్చి 9 : మండంలోని చిన్నపెండ్యాలకు చెందిన జింక రాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో మిత్రులు స్పందించి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. 2003–2004లో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు రూ.32,600 అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది మహేందర్, తాళ్లపల్లి కాంత్రికుమార్, గడ్డమీది సురేశ్, దుబ్బాక రంజిత్, గడ్డమీది అశోక్, జగన్‌రెడ్డి, కీర్తి భరత్ పాల్గొన్నారు.

బాణాపురం వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, మార్చి 9 : జనగామ పట్టణంలోని బాణాపురం వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 38వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలను ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బూడిద రజిత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బాణాపురం వద్ద అం డర్ పాస్ ఏర్పాటు చేయకుంటే ఆ ప్రాంత ప్రజలతో పాటు ఈ మార్గంలో ఇతర గ్రామాలకు వెళ్లే వారు రోడ్డు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించి అక్కడ అండర్ పాస్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

పాలకుర్తి, మార్చి 9: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్, ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత, ఎస్సై ఎం లింగారెడ్డి, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఎడవెల్లి సోము, ఎలమకంటి సందీప్, వనం సురేశ్, శీల లింగయ్య, కూనబోయిన కుమారస్వామి, వాకిడి రాజుకుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 9 : మండలంలో ని సముద్రాలలో రా జ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం బౌ ద్ధ భిక్షువు భూమి పూజ చేశారు. జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. అంబేద్కర్ సత్యాన్ని తెలుసుకొని 1956లో నాగపూర్‌లో 10 లక్షల మంది సమక్షంలో బౌద్ధాన్ని స్వీకరించిన గొప్ప వ్యక్తి అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో అందరూ పయనించాలని వారు కోరారు.